క్లుప్తంగా

సివిల్ సప్లయిస్ గోదాముల తనిఖీ



గోదాము వద్ద తనిఖీ చేస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు(మెట్రో): నగర సమీపంలోని వంగూరు సివిల్ సప్లయిస్ బఫర్ గోదాము, ఏలూరు మండల స్థాయి గోదాములను మంగళవారం జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. గోదాము ఇన్‌చార్జితో కలిసి రికార్డులను పరిశీలించారు. పేదలకు సంబంధించిన సరుకులను సకాలంలో పంపిణీ చేసేలా చూడాలని, అవకతవకలకు పాల్పడినా, అక్రమాలు చేసినా సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. జిల్లా పౌర సరఫరాల మేనేజర్ వి.శ్రీలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్‌ఎస్‌ఎస్ రాజుల సమక్షంలో ఏలూరు మండల స్థాయి గోదాములో ఉన్న నిత్యావసర సరుకుల నాణ్యత, పరిమాణాన్ని పరీక్షించారు. నిల్వ ఉన్న సీజెడ్ రైస్‌పై నివేదిక ఇవ్వాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని జేసీ ఆదేశించారు.

7 నుంచి ప్రార్థన పండుగలు



మన్నా చర్చిలో పోస్టర్ విడుదల చేసిన నిర్వాహకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విశ్వశాంతి, లోక రక్షణ కోరుతూ నగరంలో ఏసు పిలుచుచున్నాడు పేరుతో మూడు రోజుల పాటు ప్రార్థన పండుగలు నిర్వహించనున్నట్టు నగరంలోని మన్నా చర్చ్ పాస్టర్ ఎం జ్యోతిరాజు తెలిపారు. మంగళవారం స్థానిక శాంతినగర్‌లోని మన్నా చర్చ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు స్థానిక ఇండోర్ స్టేడియం గ్రౌండ్స్‌లో బారీ ఎత్తున ఈ ప్రార్థన పండుగలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో వాక్యోపదేశకులు పాల్ దినకరన్, సిస్టర్ ఇవాంజలిన్ పాల్ దినకరన్‌లతో పాటు బ్రదర్ శామ్యూల్ దినకరన్, సిస్టర్ స్టెల్లా రమోల, బ్రదర్ డానియేల్ డేవిడ్‌సన్‌లతో పాటు తాను వాక్యపరిచర్య నిర్వహించనున్నట్టు తెలిపారు. మన్నాచర్చ్ వర్షిప్ బృందం ఆధ్వర్యంలో మధుర సంగీత కార్యక్రమాలు భక్తి కీర్తనల ఆలాపనలు, స్తుతి ఆరాధనలు నిర్వహిస్తారని వివరించారు. ఈ పండుగల్లో ప్రతి విశ్వాసుడు పాల్గొని శాంతి, సమాధానం పొందాలని కోరారు. ఈ సందర్భంగా ప్రార్థన పండుగల పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో బిషప్ ఎం ఎలీషా రాజు, మన్నా చర్చ్ ప్రతినిధులు తాతపూడి రూజ్‌వెల్ట్, ఎం అరుణ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము, ధూళితో అవస్థలు

- బిషప్ రోడ్డులో దుస్థితి
- అడుగడుగునా గోతులు
- వాహన చోదకులు, నివాసితులకు ఇబ్బందులు



గోతులమయమైన బిషప్ హౌస్ రోడ్డు

ఏలూరు రూరల్ : ఏలూరులోని బిషప్ హౌస్ రోడ్డు గోతులమయంగా మారింది. వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము, ధూళి ఎగసిపడడంతో ద్విచక్ర వాహన చోదకులు, స్థానిక నివాసితులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

అభివృద్ధిపై నిర్లక్ష్యం

విద్యానగర్ పరిసరాల్లో బిషప్‌హౌస్ రోడ్డు ప్రధానమైంది. ఈ రోడ్డులో సీఆర్ఆర్ కళాశాల నుంచి శనివారపుపేట వైపుగా వందలాది మంది స్కూటర్లు, బైక్‌లు, ఆటోలు, కార్లలో పయనిస్తుంటారు. సెయింట్‌గ్జేవియర్ స్కూల్ నుంచి బిషప్ హౌస్, మేరిమాత టవర్, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ క్యాంప్ ఆఫీస్, సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల రోడ్డు అధ్వానంగా తయారైంది. దాదాపుగా ప్రతి 10 అడుగులకు ఒక గుంత పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు భవన యజమానులు మట్టి, రబ్బీస్‌తో కొన్నిచోట్ల రోడ్డుపై ఉన్న గుంతలను స్వచ్ఛందంగా పూడ్చారు. అవి వాహనాల రాకపోకలతో మరింత అధ్వానంగా మారాయి.



దుమ్ము, ధూళితో అధ్వానంగా మారిన బిషప్ హౌస్ పరిసరాలు



వాహనాలు ఇంటి పక్క నుంచి వెళ్లకుండా అడ్డు పెట్టిన ఇటుకలు

రంగు మారిన భవనాలు

బిషప్ హౌస్ రోడ్డులో వాహనాల రాకపోకల సమయంలో దుమ్మూ దూళి ఎగసిపడి భవనాల రంగు మారిపోయింది. పార్కింగ్ చేసిన కార్లు నల్లగా మారిపోతున్నాయని యజమానులు వాపోతున్నారు. పచ్చని చెట్లు సైతం బూడిద రంగులో కనిపిస్తున్నాయి. పరిసర ఆసుపత్రికి వస్తున్న ప్రజలు సైతం దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము కారణంగా శ్వాసకోశ ఇబ్బందులు వస్తున్నాయని పలువురు వాపోతున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని కోరుతున్నారు.

తలుపులు మూసుకుంటున్నాం

రోడ్డుపై కార్లు వెళ్లే సమయంలో దుమ్ము రేగుతుంది. ఇళ్లలోని దుమ్ము చేసి వస్తువులన్నీ రంగు మారిపోతున్నాయి. నిత్యం ఇదే సమస్య. చేసేది లేక 24 గంటలు తలుపులు మూసుకునే ఉంటున్నాం. ఒక గంట తలుపు తీస్తే, ఇంట్లో అన్ని వస్తువులపై దుమ్ము చేరుతుంది. అధికారులు ఈ రోడ్డును అభివృద్ధి చేయాలి. లేదంటే అనారోగ్య సమస్యలు తప్పవు.

– శాంతిశ్రీ, స్థానికురాలు

వెన్ను నొప్పి

నేను రోజూ ఈ రోడ్డులో వెళుతుంటాను. గోతుల వల్ల నాకు వెన్ను నొప్పి వస్తుంది. రోడ్డుకు రెండు పక్కల ఇసుక, మట్టి పేరుకుపోయింది. వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము రేగుతోంది. దీంతో శ్వాస కోస సమస్యలు వస్తున్నాయి. అధికారులు ఈ రోడ్డు అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. కనీసం గోతులైనా పూడ్చాలి.

– జయాకర్, వాహన చోదకుడు

ఆశ్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్



ఆశ్రంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్

ఏలూరు రూరల్ : ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా మంగళవారం ఆశ్రం వైద్యశాలలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించామని సీఈఓ డాక్టర్ కె.హనుమంతురావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆశ్రం క్యాన్సర్ కేర్ విభాగానికి అంకాలజిస్ట్ శైలజ, డాక్టర్ సింధు, కళ్యాణి ఇతర విభాగాల వైద్య నిపుణులు సుమారు 120 మంది రోగులకు సేవలు అందించడంతోపాటు ఉచితంగా మందులు అందించామని వివరించారు. పాప్ స్మియర్, అల్ట్రాసౌండ్, మామోగ్రఫీ, ఎక్సరే తదితర పరీక్షలు ఉచితంగా చేశారని పేర్కొన్నారు. ఏలూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు మల్లపల్లి చలపతిరావు, కార్యవర్గ సభ్యులు నోరు, రొమ్ము, థైరాయిడ్, ఊపిరితిత్తులు, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పించామని వివరించారు.

జైలులో సౌకర్యాలపై ఆరా



జిల్లా జైలులో ఆహారాన్ని పరిశీలిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు టౌన్: స్థానిక జిల్లా కారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఖైదీల ఆహార, వైద్య, మంచినీటి నాణ్యతను ఆయన పరిశీలించారు. ఖైదీలకు ఎలాంటి సౌకర్యాలు అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. జైలు పరిసరాల పరిశుభ్రత మొదలైన వసతులపై ఆరా తీశారు. పోలీసు అధికారులు నిందితులను అరెస్టు చేసే సమయంలో ముందుగా అరెస్టు విషయాన్ని దగ్గర బంధువులు లేదా స్నేహితులకు తెలియజేయాలని రత్నప్రసాద్ అన్నారు. కేసు వివరాల పత్రాలను ముద్దాయిలకు అందజేయాలని, ఇది ఖైదీల హక్కని అన్నారు. లేనిపక్షంలో సంబంధిత మెజిస్ట్రేట్ ముందు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఖైదీలకు అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసి, న్యాయ సహాయం అందిస్తుందని తెలిపారు. కారాగారం సూపరింటెండెంట్ సీహెచ్‌ఆర్‌వీ స్వామి, జైలర్లు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన



అడిషనల్ ఎస్పీ సూర్యచంద్రరావును సన్మానిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ రెడ్డి అటానమస్ కళాశాల రాజనీతి, అర్థశాస్త్రం, చరిత్ర, ఐక్యూఏసీ విభాగాల ఆధ్వర్యంలో భారతదేశంలో చట్టాలపై అవగాహన అనే అంశంపై అతిథి ఉపన్యాసం కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన ఏలూరు అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు మాట్లాడుతూ చట్టాల ఆవశ్యకతను విద్యార్థులకు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ కేఏస్ విష్ణుమోహన్ మాట్లాడుతూ ఇలాంటి అతిథి ఉపన్యాసాలతో విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీయ వచ్చన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ సూర్యచంద్రరావును కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.విశ్వేశ్వరరావు, రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రం, చరిత్ర విభాగాధ్యక్షులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జి.రాము, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



పవరుపేటలో ఆలయం వద్ద పోటెత్తిన భక్తులు



దర్శనానికి బారులు తీరిన భక్తులు

భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రథ సప్తమి పర్వదినం సందర్భంగా మంగళవారం నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సూర్యనమస్కార కార్యక్రమాలు నిర్వహించారు. పాత బస్టాండు వద్ద ఉన్న పాండురంగ స్వామి ఆలయంలో సూర్య జయంతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ మాట్లాడుతూ ప్రపంచానికి వెలుగులు ఇచ్చే సూర్య భగవానునికి రథసప్తమి రోజు ప్రత్యేక పూజలు చేయడం అనాదిగా వస్తున్న ఆచారమన్నారు. సూర్యభగవానుడు ప్రతి కుటుంబానికి ఆరోగ్య, ఐశ్వర్యాలు ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయంలో విఘ్నేశ్వర పూజ, మండపారాధన, అరుణపారాయణ, సూర్య నమస్కార కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సూర్య హోమం, పాలు పొంగించు కార్యక్రమం, సహస్రనామార్చన నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు నెరుసు చిరంజీవులు, మెగా దుర్గారావు, ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ బాలా త్రిపుర సుందరి పాల్గొన్నారు.

- ఆర్ఆర్‌పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి విశేష అభిషేకాలు, అలంకరణ చేశారు. మాడ వీధుల్లో శ్రీవారికి సూర్యప్రభ వాహనం, సింహ వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్పవృక్ష వాహనం, గజ వాహనం చంద్రప్రభ వాహనాలతో ప్రత్యేక సేవ చేశారు.
- పవర్‌పేటలోని శ్రీ ధన్వంతరి వైద్య భగవాన్ ఆలయంలో విశేష హోమాలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఇండోర్ స్టేడియంలో పతంజలి యోగ ఆధ్వర్యంలో సూర్య భగవాన్ పూజలు చేశారు. యోగా గురువు ధనెంకుల గోపాలకృష్ణ, రిటైర్డ్ ఏఎస్‌పీ విజయ రామారావు ఆధ్వర్యంలో 108 సూర్య నమస్కారాలు చేశారు. డాక్టర్లు ముక్కామల పార్థసారథి, ఇరిగినేని చెంచయ్య, రిటైర్డ్ పీఈటీ బాలకృష్ణ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఆర్‌పేటలో సూర్యప్రభ వాహనంపై శ్రీవారు



పాండురంగ స్వామిని దర్శించుకుంటున్న మామిళ్లపల్లి జయప్రకాష్



పవరుపేట సూర్యాలయం వద్ద పాలు పొంగిస్తున్న మహిళలు



సూర్య నమస్కారాలు చేస్తున్న పతంజలి యోగా బృందం

పేరంటాలమ్మ ఉత్సవాలు ప్రారంభం

దెందులూరు: మండలంలోని గాలాయగూడెంలో అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ 68వ వార్షికోత్సవాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. ప్రారంభోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శర్మ అచ్చమ్మ అమ్మవారికి తొలిరోజు పసుపు అలంకరణ చేశారు. సాయంత్రం చిన్నారుల కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రదర్శన చేసిన చిన్నారులను అభినందించారు. పోలీస్ అవుట్ పోస్టు, వైద్య శిబిరం, మరుగుదొడ్లు, పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ యువత అమ్మవారి ఉత్సవాల్లో వాలంటరీగా సహాయ సహకారాలు అందిస్తున్నారు.

● గొడుగే రక్ష



వేసవిని తలపించేలా ఎండలు కాస్తున్నాయి. రథసప్తమి రోజు మంగళవారం సూర్యభగవానుడు తన ఉగ్రరూపాన్ని చూపించాడు. ఉష్ణోగ్రత 36 డిగ్రీలు నమోదైంది. దీంతో ప్రయాణికులు హడలిపోయారు. ఏలూరు వన్‌టౌన్‌లో గొడుగు నీడలో కాలేజీకి వెళుతున్న విద్యార్థినుల దృశ్యమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు

కష్టపడితేనే మంచి ఫలితాలు



పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందించిన మానవత సభ్యులు

గణపవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదవాలని మానవత సంస్థ రీజియన్ చైర్మన్ కాకర్ల వినాయక, సీనియర్ నాయకుడు పి.హరికుమార్‌రాజు అన్నారు. మంగళవారం గణపవరం మండలం కాశిపాడు, పిప్పర ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. నిద్రాహారాలు మాని చదవడం కన్నా, ప్రణాళిక ప్రకారం రోజూ కనీసం పది గంటలు చదువుపై దృష్టి సారించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థి జీవితానికి మలుపుని, ఇక్కడ సాధించిన ఫలితాలే మన భవిష్యత్తును నిర్ణయిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో సుబ్బరాజు, వంకాలయ రామారావు, కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ ఫీడర్లకు లైన్ షిఫ్టింగ్ కారణంగా బుధవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. కోట దిబ్బ, మెయిన్ బజార్, పాండురంగ థియేటర్, అగ్రహారం, మార్కెట్, కెనాల్ రోడ్, సత్యనారాయణ పేట, లంబాడి పేట, వెన్నవల్లి వారి పేట, బావిశెట్టి వారి పేట, నల్ల దిబ్బ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నగరంలో వాహన తనిఖీలు



వాహన చోదకులకు అవగాహన కలిగిస్తున్న ఎంవీఐ నరేంద్ర

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రవాణా శాఖ అధికారులు మంగళవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. సీఆర్ఆర్ కళాశాల వద్ద మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర ద్విచక్రవాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్, వాహనాలకు సరైన పత్రాలు లేని 30 మందిపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుము వసూలు చేశామన్నారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రజ్ఞ, తదితరులు పాల్గొన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ స్థానిక గుడ్ సమరిటన్ క్యాన్సర్ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందికి రహదారి భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను ఉరితీయాలి

ఏలూరు (టూటౌన్) : మహిళలపై అత్యాచారానికి పాల్పడే నిందితులను వెంటనే ఉరి తీయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అయోధ్యలో ఈనెల 2న దళిత యువతిపై అత్యాచార ఘటన చోటు చేసుకోవడం సభ్య సమాజానికి సిగ్గుచేటని తెలిపారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులు, యువత, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, హింసను అరికట్టే విధంగా కఠిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	12
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	24
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు–బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	31
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	35
ఏలూరు – తిరుపతి	16.00	4830	19
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24

హెడ్ కానిస్టేబుల్ రాంబాబుకు నివాళి



రాంబాబు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ కేపీ శివకిషోర్

ఏలూరు టౌన్: దెందులూరు పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి.రాంబాబు విజయవాడ కామినేని హాస్పిటల్‌లో మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ మృతిచెందారు. ఏలూరు రూరల్ మల్కీపురం (పాలగూడెం)లోని స్వగృహం వద్ద ఆయన మృతదేహాన్ని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ సందర్శించి నివాళులర్పించారు. రాంబాబు భార్య విజయలక్ష్మి, కుటుంబ సభ్యులను ఎస్పీ పలకరించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. 32 ఏళ్ల సర్వీసులో ఎలాంటి రిమార్కు లేకుండా నిబద్ధతతో పనిచేసిన రాంబాబు కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, పోలీస్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, నాయకులు శానం రమేష్‌బాబు, 1993 బ్యాచ్ పోలీస్ సిబ్బంది హాజరై నివాళులర్పించారు.